


**మేనేజర్ మధుమూర్తి గుమ్మంలోకి అడుగుపెట్టాడు. పులుగడిగిన ముత్యంలాగున్నాడు.**

*దరహాసం అతని ముఖమండలంలో మనోహరంగా భాసిస్తోంది. చల్లని వెన్నెల వెలుగుల్ని* **వెదజల్లుతున్నట్లు ఉద్యోగులందర్నీ కలయజూశాడు.**

"వెంకన్నా! త్వరగా కాసిని మంచి నీళ్ళు పట్రామ్మా!" అన్నాడు ముత్యాలు జలజల రాలినట్లు.

ఆ పిలుపుకి వెంకన్న ఆనంద తరంగితుడై అంత మనిషి చప్పున చువ్వలా వంగిపోయి ఎంతో వినయంగా "చిత్తం" అని అక్కణ్ణుంచి వేగంగా కదిలిపోయాడు.

ఈ సన్నివేశాన్ని అందరూ సంభ్రమాశ్చర్యాలతో తిలకిస్తుండగా మధుమూర్తి హుందాగా అడుగులు వేసుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అక్కడ వాతావరణం నిశ్శబ్దంగా వుంది.

మేనేజరు మధుమూర్తిలో హఠాత్తుగా ఇలాంటి మార్పు రావడానికి కారణమేమిటి చెప్మా? అన్నట్లు మౌనంగా గుసగుసలాడుతూ ఒకర్నొకరు చూసుకున్నారు.

"తుపానుకి ముందు సముద్రం ప్రశాంతంగానే అగుపిస్తుంది" అన్నాడు శాస్త్రి.

"అందంగా నాట్యం చేస్తున్నట్లగుపించే పామే గట్టిగా కాటువేస్తుంది." అన్నాడు మురళి.

"విలన్ సౌమ్యంగా అగుపిస్తున్నాడంటే వాడి ప్రత్యర్థులు ఉచ్చుల్లో చిక్కుకు పోతున్నట్లే లెఖ్ఖ?" సహాయ దర్శకుడి చిన్నమ్మ అల్లుడి కామెంట్.

"స్వప్రయోజనాల సాధనలో రాజకీయ నాయకుని రంగులు పసిగట్టడం సామాన్యులకు సాధ్యమా?" ఓ సర్పంచి బావమరిది విసురు

కాలింగ్ బెల్ మోగడంతో అందరి నోళ్ళూ టక్కున మూతపడ్డాయి.

మేనేజరు రూంనుంచి బయటికొచ్చిన వెంకన్న సరాసరి ఎ. వన్. సీటు దగ్గరగా

వచ్చి. "తమర్ని పిలుస్తున్నా రండయ్యా!" అన్నాడు

ఏ. వన్. గంగాధరం అపర యమధర్మరాజు సాన్నిధ్యంలోకి వెడుతున్నట్లు బిక్కుబిక్కుమంటూ వెళ్ళాడు.

ఎప్పుడూ మేనేజరుతో అరగంట చీవాట్లు తిని దాదాపు ఏడ్పు మొహంతో ఈసురోమంటూ కాళ్ళీడ్చుకుంటూ సీట్లోకెళ్ళి కూలబడే గంగాధరం ఈసారి వెళ్ళిన అయిదు నిమిషాల్లో నవ్వు మొహంతో, ఉత్సాహంగా నడుచుకుంటూ తన సీట్లోకెళ్ళి కూర్చున్న వైనం అందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేసింది.

ఒక్కొక్కరుగా గుమాస్తాలంతా మేనేజరు గదిలోకి వెళ్ళి సంతకాలైన ఫైల్సు తీసుకుని హుషారుగా తిరిగి వస్తున్నారు.

ఒక్క మాటలో ఆ ఆఫీసు వాతావరణమంతా మహా చైతన్యవంతమై ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నట్లుగా వుంది.

మధుమూర్తి మున్నెన్నడూ లేనంత ఉత్సాహంగా, హుషార్‌గా పనిచేసున్నాడు. ఉద్యోగులందరితో సౌమ్యంగా, సరదాగా మాటాడుతున్నాడు ఆయా ఫైల్సుకి సంబంధించి చక్కని సలహాల్ని సూచనల్ని యిస్తున్నాడు అలాగే జవాన్లని ఎంతో ప్రేమగా, లాలనగా పిల్చి పనులు పురమాయిస్తున్నాడు. చెరగని చిరునవ్వుతో వేగంగా ఫైల్సు చూసున్నాడు. గంటలు నిమిషాల్లా గడిచిపోతున్నాయి....

ఆఫీసు గోడ గడియారం సరిగ్గా నాలుగ్గంటలు కొట్టింది

ఇంతలో ఫోన్ మోగడంతో రిసీవరందుకుని "హల్లో. మేనేజర్ స్పీకింగ్" అన్నాడు.

అవతల కంఠం ఇంజనీర్‌ది. ఆఫీసు కాగానే సరాసరి క్లబ్‌కి వచ్చేయమన్నాడు. ఓ అరగంట అటూ, ఇటుగా వచ్చేయమన్నట్లు చెప్పి ఫోన్ పెట్టేసి తిరిగి తన పనిలో నిమగ్నుడయ్యాడు మధుమూర్తి.

* * *

"వీనస్" క్లబ్బుముందు రిక్షాదిగి హడావుడిగా అడుగులు వేస్తూ సుపరిచితమైన తమ వింగ్‌వేపుకి వెళ్ళాడు. ఇంజనీర్ కంట్రాక్టర్. సూపరింటెండెంట్, డాక్టర్ చక్రపాణి, లాయర్ గోవర్ధనరావ్ మొదలైన తనక్కావలసిన మిత్రులంతా రెడీగా కూర్చుని వున్నారు టేబుల్సు ముందు రకరకాల ఖరీదైన విస్కీ సీసాలు గ్లాసులు, సోడాలు, బీరు బాటిల్సు. అవసరమైన అనుపానాలు మొత్తంమీద రంగం అద్భుతంగా సిద్ధమై వుంది.

మధుమూర్తిని చూడటంతో అందరూ హర్షాతిరేకంతో చప్పట్లు చరిచారు.

"తమ రాకకోసమే ఎదురుచూస్తున్నాం ముందుగా ఫోన్ చేసి చెప్పినా ఇంత లేటేమిటండీ!" అన్నాడు ఇంజనీర్ కాస్త విసుగుని ప్రదర్శిస్తూ.

"ఎక్స్ట్రీమ్లీ సారీ, మైడియర్ ఫ్రెండ్స్! ఇక్కడ మన పరిచయంలో ఇవ్వాళ మాత్రమే నేను లేటు మరిహ లేటంటూ వుండదు "

"దట్సాల్ రైట్! కమాన్ టేక్ యువర్ సీట్" అన్నాడు కంట్రాక్టర్.

సోడాలు మోగాయి. పొడవైన గ్లాసుల్లో మధువుతోపాటు ఐస్ ముక్కలు ముద్దు ముద్దుగా మునిగాయి. అమృతం పానానికి సిద్ధంగా వుంది

ఇంజనీర్ తన ముందున్న గ్లాసు అందుకుని తనే ముందుగా "ఛీర్స్...." అన్నాడో లేదో "ఎక్స్‌క్యూజ్‌మి వన్ మినిట్" అంటూ హఠాత్తుగా సీట్లోంచి లేచి నిల్చున్నాడు మధుమూర్తి.

గ్లాసులందుకోబోయిన అందరి హస్తాలూ హఠాత్తుగా మంత్రించినట్లు ఆగిపోయాయి ఆశ్చర్యంగా మధుమూర్తికేసి చూశారు.

"ఇవ్వాళ థరీఫస్ట్ రేపు ఫస్టు. అంటే న్యూ ఇయర్సు డే! చాలా ఆనందంగా అంటున్నాను. విత్ యువర్ కైండ్ పర్మిషన్ నేటి ఖర్చంతా నాదే!" అని ఓ క్షణం అందర్నీ కలయజూశాడు మధుమూర్తి.

"ఓ. కే. గ్రాండ్ ఐడియా." అన్నాడు ఇంజనీర్ ఉచ్చైస్స్వరంతో.

హర్షంతో అందరూ చప్పట్లు కొట్టారు.

"అయితే ముందుగా నేను నాలుగు మాటలు మీతో మనవి చేసుకోవాలి."

"మధువు ముందున్నప్పుడు మనవీగినవీ యేమిటండి మీరు మాట్లాడేది? సిప్ చేస్తో మాటాడుకుందాంగా!" అన్నాడు డాక్టర్ చక్రపాణి పెదవులను నాలుకతో తడుపుకుంటూ.

"నోనో! త్వరగా ముగించేస్తాను దయచేసి వినండి" మధుమూర్తి గంభీరంగా మారిపోయాడు.

అందరూ అతనికేసి అయోమయంగా చూస్తున్నారు.

"జీవితంలో మొదట్నుంచీ దేన్నయితే తీవ్రంగా అసహ్యించుకున్నానో అది నేటి వరకూ నా కత్యంత ప్రియమైనదిగా మిగిలిపోయింది. ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. మేనేజరుగా పదవిని పొందాను. ఖరీదైన పార్టీలవాళ్ళు, నా చుట్టూ తిరుగుతూ జీవితంలో కొత్తరకం


ఊరగాయలకు అమూల్యమైన నూనెలు

అగ్‌మార్కు కాబడిన

A. S. బ్రాండ్ పప్పునూనె

మేష్నను బ్రాండ్ నువ్వుల నూనె

ఊరగాయలను మెత్తబడనీయవు. బూజు పట్టనీయవు.
చాలాకాలము నిల్వయుండును. అమితమగు రుచిని కలుగజేయును.

16, 4, 2 కేజీల డబ్బాలలో ప్యాకింగ్ చేయబడుచున్నవి
ఇండియన్ గవర్నమెంటువారి అగ్‌మార్కు సీలును గమనించుకొనుడు.

డిపోలు: * డా॥ పుళక్కి స్ట్రీటు, తెనాలి ఫోన్ : 150
* 1-3-166 రాజా మొదలియార్ స్ట్రీటు
కలాసిగూడ, సికింద్రాబాద్ ఫోన్ : 76160

బళ్లారి, గుంతకల్, విజయవాడ, ఒంగోలు, మద్రాసు, నంద్యాల. బరంపురం, కలకత్తా, జెంషెడ్‌పూర్, నాగపూరులలో మా ఏజంట్లుగలరు.

Manufacturers, స్థాపితం 1910

అంబటి సుబ్బన్న అండ్ కో., సామర్లకోట

ఇండియాలోకెల్ల పెద్ద అగ్‌మార్కు జింజిలీ ఆయిలు, ప్యాకర్సు



ఖర్గపూర్ ప్రవాసాంధ్ర నృత్యనాటిక కళాపరిషత్‌లో "సమాధానం కావాలి" నాటకం ప్రదర్శించిన జంషెడ్‌పూర్ నట సమాఖ్య సభ్యులు, శ్రీయుతులు సి.ఎస్.ఎన్. మూర్తి బి.వి. రంగారావు, కె.వి రమణ, వై.వి. రావు, టి.వి. హనుమంతరావు. (నిలబడినవారిలో) ఎమ్.బి.ఎస్. మూర్తి, వి.కె. రావు డాక్టర్ జె.వి రమణ. వి. రామారావు, ఆర్. ధర్మారావులు. ఎమ్. చిరంజీవి రచించిన ఈ నాటకం ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి పొందింది.

ఇంద్రధనుస్సుల్ని చూపించారు.

"మొదట్లో కంపెనీ సేక్ అనీ కర్టసీ సేక్ అనీ ప్రారంభమయిన విస్కీ పరిచయాలు తాగుబోతుగా బస్కీలు తీయించాయి నాతో. మనిషిని నీచుడిగా, ధూర్తుడిగా, కాముకునిగా, కర్కోటకునిగా నగ్న నాట్య ప్రదర్శనల్ని చేయించే లక్షణాలు ఈ తాగుడులో పుష్కలంగా వున్నాయని స్పష్టంగా గ్రహించాను."

"గురూగారూ! ఉపన్యాసమా? ప్లీజ్ స్టాపిట్! సెకండ్ రౌండ్‌లో చెబుదురు గాని" అన్నాడు కంట్రాక్టరు ఉండబట్టలేక.

"జస్ట్ ఎ మినిట్ ప్లీజ్! అయిపో వచ్చింది" తిరిగి ప్రారంభించాడు మధుమూర్తి.

"ఈ మందుపార్టీలు అప్పుడప్పుడూ కాక పార్టీలవాళ్ళు తమ తమ పనుల సాధన కోసం దాదాపు రోజూ మనకి విస్కీతో ఉత్సవాలు చేయిస్తూనే వున్నారు నేను తాగివెళ్ళిన ప్రతిరాత్రీ మా ఆవిడ బాధతో, ఆవేదనతో ఎంతగా కుమిలిపోతోందో నాకు బాగా తెలుసు.

"నా ఆరోగ్యంకోసం, నా భార్య ఆనందం కోసం, నా బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం, మంచి మర్యాదలు మూర్తీభవించిన మనిషిగా బతకడంకోసం ఐ హేవ్ డిస్ బ్లడీ విస్కీ! ఫ్రమ్ టుమారో ఆన్వర్డ్స్ ఇట్ నాట్ టు సైట్ గో ఎహెడ్! థ్యాంక్యూ ఆల్!" కూర్చున్నాడు మధుమూర్తి.

"హమ్మయ్యా!" అని నిట్టూర్చి అందరూ అమృతాన్నందుకుని ఆప్యాయంగా ఆరగించడం ప్రారంభించారు.

విస్కీ సీసాలు వరుసగా ఖాళీఅయి పోతున్నాయి....

ఛెణుకులే, ఛలోక్తులు, విసుర్లు, సినిమా కబుర్లు, ప్రపంచ సుందరీ మణులు, వారి ఎంపిక, కొలతలు, జ్ఞాపకాలు, శృంగారం, బూతులు, జోకులు, సోడాల చప్పుళ్ళు, సిగరెట్ పొగలు, నవ్వులు, రాగాలు వాతావరణం రసకందాయంగా సాగిపోతున్నది.

ఆఖరి ఛాన్సని అందరికంటే అధికంగా తాగాడు మూర్తి. అందరూ లేచారు.

ఇంజనీర్ మధుమూర్తి స్థితిని గమనించి "పదండి మూర్తిగారూ! మిమ్మల్ని నా జీప్‌లో డ్రాప్‌చేస్తాను. మరీ వోవరై పోయారు" అన్నాడు.

"మైడియర్ యింజనీర్! నేను కావాలనే వోవరయ్యాను. నేడు చాలా ఆనందంగావుంది. రేపట్నుంచి అసలు.... అసలు ఆనందం.... అనుభవిస్తాను. నా.... నాక్కారవసరంలేదు. సర్దాగా రాయబారం సీన్లు, పద్యాలు పాడుకుంటూ కులాసగా నడిచే వెడతాను. డోంట్ వర్రీ యెబౌట్ మీ. థాంక్స్. ఐ కెన్ గో! గుడ్ నైట్!" అన్నాడు మధుమూర్తి గాల్లో చేతులూపుతూ మాటలు తడబడుతూను.

"మూర్తిగారూ! రేపు మీరీ ఆనంద మందిరానికి రారన్నారుగా! అందుకే ముందుగా చెబుతున్నాను. విష్ యు ఎ హేపీ న్యూ ఇయర్!" అన్నాడు ఇంజనీర్.

"విష్....యు....ది....సేమ్" అన్నాడు మధుమూర్తి.

పరస్పరం కరచాలనం చేసుకుని విడిపోయారు.

మధుమూర్తి సరదాగా నడిచి వెళ్ళగల ననుకున్నాడుగానీ కాళ్ళు మాత్రం భరత నాట్యం చేస్తున్నట్లు గమనించాడు. అయినా కసిగా నడవాలన్న కోర్కెతో అడుగులు వేస్తూ వెడుతున్నాడు.

ఒకచోట హఠాత్తుగా ఓ కిళ్ళీబడ్డీకి డ్యాష్ కొట్టబోయాడు. కొద్ది గజాల దూరం నుంచి జాగ్రత్తగా మధుమూర్తిని ఫాలో అవుతున్న ఓ యువకుడు మెరుపులా కదిలి మూర్తిని పట్టుకుని ఆ ప్రమాదాన్నుంచి గొప్పగా తప్పించాడు.

ఆ ఆపద్బాంధవునికి మూర్తి చేతులెత్తి దండంపెట్టాడు. "సార్! దయచేసి మీరు రిక్షా ఎక్కండి. మీ శ్రేయాభిలాషిలా బతుకున్నాను." అంటూ అతనే ఓ రిక్షాని పిలిచి "ఇల్లెక్కడో అడ్రస్ చెప్పండి రిక్షా వచ్చింది" అన్నాడు.

"ఒరేయ్ రిక్షా! ఏవూర్రా నీది?" మూర్తి ప్రశ్న.

"ఈ వూరే బాబూ!" వినయంగా రిక్షావాలా జవాబు.

"ముత్యాల్రావ్‌పేట.... తె.... తెలుసురా నీకు?"

"తెలుసునండయ్యా!"

"మా యిల్లు.... మా యిల్లు.... తెలుసా మరి?"

"చెప్పండి బాబో!"

"నే చెప్తే నీకేంట్రా తెలిసేది రాస్కెల్! నాటుసారా కొట్టావా ఏంరా?"

"ఛీ, ఛీ అలవాటులేదు బాబో!"

"ఆహా! ఆహాహా! నాకు చెప్తావేరా కబుర్లు? ఒరేయ్! మందు కొట్టిన మగాణ్ని నమ్మకూడదురోయ్!"

"అయ్యన్నీ నా కెందుకు — సప్పుడు చెప్పండి బాబో!"

"ఏంట్రా చెప్పేది? మా యిల్లు.... మా యిల్లు తెలియదురా నీకు! నీతో.... నీతో నే చెప్పిస్తాను చూడు. లోకనాథంగాడి కామాక్షి డాబా తెలియదుటా నీకు?"

"కామమ్మగారి డాబా నా కెందుకు తెలవదు? ఎక్కండి బాబో యెల్లిపోదాం."

మధుమూర్తి పగలబడి నవ్వుతూ రిక్షాని అధిరోహించాడు. ఆ యువకుడు

మూర్తిని సామానుతో రిక్షాలో యెక్కించాడు. రిక్షా వెళ్ళిపోయింది.

ఆ యువకుడు రెండు మూడు సార్లు 'ముత్యాలరావ్ పేట, లోకనాథం, కామాక్షి డాబా' లోలోపల గొణుక్కుని అక్కణ్ణుంచి వేగంగా కదిలిపోయాడు.

*            *            *

సరోజకి భర్తతో కలిసి భోజనం చేయడం అలవాటు. అంచేత మధుమూర్తి తనకెన్ని అర్జంటు పనులున్నా వేగంగా ముగించుకుని రాత్రి ఎనిమిది లోపుగా ఇల్లు చేరుకుంటాడు. తాగినప్పుడు మాత్రం సగం రాత్రి గడిచాకగానీ ఇల్లు చేరేవాడుకాడు. ఆ వాసనని భరించలేదు సరోజ. ఆతనిమీదఅసహ్యంతో, కోపంతో లోలోపల ఉడికిపోతూ తానతన్ని తాకకుండా, అతన్ని తాకనివ్వక భోజనం చేయమని మాట మాత్రం అడక్కుండా తాను చెయ్యక మంచంమీద వాలికుళ్ళికుళ్ళి ఏడుస్తూ తెల్లవార్లూ గడిపేది.

మధుమూర్తి ఉదయం ఆఫీసుకి వెళ్ళే ముందు తన నిర్ణయాన్ని చెప్పివెళ్ళినప్పట్నుంచీ సరోజ ఆనందానికి అవధి లేకుండా పోయింది. మూర్తి తీవ్రంగా ఆలోచించనిదే ఒక నిర్ణయానికి రాడు. వచ్చాడంటే దానికి తిరుగంటూ వుండదు. ఈ విషయం ఆవిడకి బాగా అనుభవం.

అతని రాకకోసమే ఒళ్ళంతా కళ్ళు చేసుకు చూస్తున్న సరోజ తలుపుచప్పుడు కావడంతో వేగంగా వెళ్ళి తలుపులు తీసి హార్దిక స్వాగతాన్నిచ్చింది. స్వయంగా అతని బట్టలు విప్పి లుంగీచుట్టి త్వరగా భోజనాలు వడ్డించి భర్తసరసనే కూర్చుని ప్రేమగా, లాలనగా గోరుముద్దలు తినిపించింది. అయితే మూర్తి ఎక్కువ తినలేకపోయాడు. ఆవిడ మాత్రం తృప్తిగా భోజనం ముగించింది.

పందిరి మంచం మీద పక్కమలిచి మూర్తిని పడుకోబెట్టి, సీలింగ్ ఫ్యాన్ ఆన్ చేసి అతని కాళ్ళ దగ్గర కూర్చుని ఎంతో ప్రేమగా అతని పాదాలు వత్తడం ప్రారంభించింది.

కాసేపట్లో మూర్తి నిద్రావస్థలోకి జారిపోయినట్లు గుర్రు శబ్దం ప్రారంభమయింది. సరోజకూడా ఆవలింతలు ప్రారంభమయ్యాయి. తలెత్తి గోడ గడియారంకేసి చూసింది. పదకొండున్నర కావొస్తోంది.

పడుకుందామని లేచి తన మంచంవేపు నాలుగడుగులు వేసి యెందుకో వెనుదిరిగి భర్తవేపు చూసింది సరోజ.

రింగుల ముంగురులు అతని ఫాలభాగం మీద జీరాడుతున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు అతని విశాలమైన ఛాతీ యెగసెగసి పడుతోంది. ఆ క్షణాన అతన్ని ముద్దు పెట్టుకోవాలన్న కోర్కె కలిగి గబగబ అతన్ని సమీపించి అతని మొహంలోకి వంగింది.

ఇంతలో టక్ టక్ మని తలుపు చప్పుడు కావడంతో తృళ్ళిపడిలేచి పమిట నిండుగా కప్పుకుని "ఎవరూ?" అంది.

"నేనేనమ్మగారూ! ఇందాక అయ్యగారు ఆఫీసులో...." మిగిలిన మాటలు అవతల నుంచి స్పష్టంగా వినిపించలేదు.

ఎవరో ఆఫీసు తాలూకు అయి వుంటారనుకుని వెళ్ళి తలుపు గడియ పూర్తిగా తీసిందో లేదో? ముగ్గురు వ్యక్తులు బిలబిలమంటూ లోపలికి తోసుకురావడం రక్ మని వాళ్ళే తలుపుకి గడియ పెట్టడం క్షణాలమీద జరిగిపోయింది.

వాళ్ళ ముగ్గుర్లో ఏ ఒక్కర్నీ ఆవిడ ఇంతకు పూర్వం చూసి వుండలేదు.

"ఎయ్! ఎవరుమీరు? ఏమిటిలా జబర్దస్తీగా లోపలికి తోసుకొచ్చారు? పైగా గడియ పెట్టారెందుకు? ఎంత ధైర్యం మీకు? ఆయన నిద్రపోతున్నారు. వెళ్ళండి బయటికి" అంది అర్థంకాని స్థితిలో మందలింపుగా.

"నోరు మెదిపావో చిత్రవధ చేస్తాను." అంటూ అందులో ఒక వ్యక్తి తళతళ మెరుస్తున్న పిడిబాకు తీసి ఆమె కళ్ళముందుంచాడు రౌద్రంగా చూస్తూ.

ఈ హఠాత్పరిణామానికి సరోజ నిర్ఘాంతపోయి గజగజ వణికిపోతూ గుడ్లప్పగించి అలాగే బొమ్మలా చూస్తూ నిల్చుండిపోయింది.

పందిరి మంచానికి అంతెత్తున కండలు తిరిగిన శరీరంతో పెద్ద పహిల్వాన్ లా అగుపిస్తున్న మధుమూర్తిని చూసి మిగిలిన యిద్దరు వ్యక్తుల గుండెలూ భయంతో దడదడ కొట్టుకోవడం ప్రారంభించాయి.

"మీ యింట్లో యెవరి ప్రాణాలు తీయటానికి రాలేదు మేం. మీమీద యెలాంటి అత్యాచారాన్ని జరపాలని మా ఉద్దేశం కాదు. ఈ విషయంలో మీరేమీ భయపడవద్దు. అరవటానికి ప్రయత్నించారో మీ అందరి ప్రాణాల్నీ దారుణంగా తియ్యగలం. మరియాదగా ఇనప్పెట్టె తాళాలు ఎక్కడున్నాయో మాట్లాడకుండా తీసివ్వండి...." కత్తి పుచ్చుకుని నిల్చున్న వ్యక్తి హూంకరించాడు.

విశాలమైన గదిలో ఓ మూలగా తాళం

సులభ వాయిదాల
పొదుపు పథకంలో
చేరండి!
లక్షల విలువయిన
బహుమతులు
పొందండి!!
జయప్రద
ఫైనాన్స్ సిండికేట్
మెయిన్‌రోడ్, రాజమండ్రి-1

ఉబ్బసానికి
మూలిక

ఉబ్బసాన్ని తగ్గించే మూలిక ఒకటి రాజస్థాన్ వాస్తవ్యులు స్వర్గీయ శ్రీ శంభునాథ్ గారి మనుమడు శ్రీ కేశవ మోహన్ లాల్ చే (పేదవారికి) పంచిపెట్టబడుతున్నది.

ఈ మూలికను ఒక సన్యాసి శ్రీ శంభునాథ్ కు ఇచ్చారు. నలభై సంవత్సరాలకు పైగా ఆయన ఉచితంగా పంచిపెట్టాడు. ఆయన నిస్వార్థ సేవకు మెచ్చి ప్రభుత్వం పింఛను ఇచ్చింది. ఈ సత్కార్యాన్ని తన మనుమనికి అప్పగించి ఆయన సన్యాసి ఆశ్రమము స్వీకరించెను. ఇప్పుడు ఆయన మనుమడు ఈ కార్యభారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే భాగ్యవంతులకు ఈ సత్కారానికి విరాళ మీయవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నారు. అనేకమంది ఉబ్బసం రోగులు దీర్ఘకాలవ్యాధి పీడితులు కూడా ఈ మూలిక మూడు మోతాదులు సేవించి ఉపశమనం పొందారు. రోగులు ఈ మూలిక కోసం ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి

శ్రీ కేశవ మోహన్‌లాల్
పో. బా. నెం 11463 కలకత్తా-6

## మన వర్ధమాన క్రీడాకారులు



# పి. ఎజ్రా

ఆంధ్రుల అభిమాన క్రీడ ఫుట్‌బాల్. తెలుగు బాలలు ప్రప్రథమంగా అఖిల భారత గ్రామీణ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌ను ఈ ఏడాది సాధించారు. విజేతలైన జట్టుకు సారధ్యం వహించిన ఘనత 16 ఏళ్ళ విజయవాడ బాలుడు పి. ఎజ్రాకు లభించింది.

ఇతడు సి. ఆర్. దాస్ క్లబ్‌లో గత మూడు ఏళ్ళనుంచి ఆడుతున్నాడు. ఇతనిలోని ప్రావీణ్యతను తీర్చిదిద్దిన ఘనత క్లబ్ కార్యదర్శి శ్రీ కొండాకు దక్కింది. ఆటలో ఆసక్తి కలిగిన ఎజ్రాను ప్రతిదినం ఉదయం, సాయంత్రం మునిసిపల్ స్టేడియం గ్రౌండులో ఆడించి, తీర్చిదిద్ది ఒక మంచి క్రీడాకారునిగా కొండా రూపొందించారు. ఆ తర్వాత ఒలింపియన్ సలాంఖాన్ వద్ద కోచింగు పొందాడు.

1976 లో కృష్ణాజిల్లా అంతర్‌జిల్లా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. ఆ జట్టులో ఎజ్రా వున్నాడు. కొల్హాపూర్‌లో జరిగిన అఖిల భారత గ్రామీణ పోటీలలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ జట్టు సభ్యుడు. 1977 లో విజయనగరంలో జరిగిన అంతర్ జిల్లా గ్రామీణ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన కృష్ణాజిల్లా విజయం సాధించుటలో ఎజ్రా సహకరించాడు. ఆ ఏడు కూడా రాష్ట్ర గ్రామీణ జట్టుకు ఎంపిక అయి పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో జరిగిన జాతీయ పోటీలలో ఆడాడు. ఈ సంవత్సరం కూడా అంటే మూడవ సారి రాష్ట్ర గ్రామీణ జట్టుకు ఎన్నిక కావడమే గాక కెప్టెన్‌గా కూడా ఎన్నికయ్యాడు. కటక్‌లో జరిగిన జాతీయ గ్రామీణ ఛాంపియన్‌షిప్ నందు తెలుగుజట్టు మొదటిసారి విజయం సాధించుటలో మన ఎజ్రా కృషి ఎంతయినా వుంది

1963 మే 16 న జన్మించిన ఎజ్రాకు చిన్నప్పటినుంచి ఫుట్‌బాల్ ఆటలో ఆసక్తి కలగడం వలన కష్టించి ఆడి గుర్తింపు పొందాడు. నిజాం గోల్డ్‌కప్, ఏలూరు, గుంటూరు, నెల్లూరు మొదలగుచోట్ల టోర్నమెంటులలో ఆడాడు. సరియైన అవకాశం లభిస్తే ఉత్తమ క్రీడాకారునిగా గుర్తింపుపొందగలడు మన ఎజ్రా.

—ముకరమ్

---

వేసి వుండని ఇనప్పెట్టెవైపు జాలిగా, దీనంగా, విచారంగా చూసింది సరోజ తాళం వేయని తన అశ్రద్ధని లోలోపల తిట్టుకుంటూ.

ముగ్గురూ అటుకేసి చూశారు. బీరువా తాళాలు బీరువాకే వ్రేలాడుతూ అగుపించాయి ఆహ్వానిస్తున్నట్లు.

సహచరులకి కానీండన్నట్లు హెచ్చరించాడు కత్తి ధరించివున్న వ్యక్తి వాళ్ళిద్దరూ అటు వేపుగా కదిలారు.

వెండి పళ్ళాలు, గ్లాసులు, రెండు మరచెంబులు, మధుమూర్తి పందాల్లో బహుమతిగా లభించిన వెండికప్పులు వగైరా అన్నింటిని ఓ చిన్న సూట్‌కేస్‌లో భద్రపరిచారు.

అనంతరం సేఫ్‌లాకర్ తెరిచారు. బంగారు గాజులు, చంద్రహారం, సరోజకి తల్లిగారినుంచి సంక్రమించిన పాతకాలపు వడ్డాణం, నాగరం, వుంగరాలు వరుసగా ఆ దొంగ వెధవల సూట్‌కేస్‌లో ఆనందంగా వెళ్ళి దాక్కుంటున్నాయి. తన కళ్ళ ముందే జరుగుతున్న ఈ దోపిడికి, దారుణానికి సరోజ గుండెలు బద్దలయ్యేలా వున్నాయి. సుమారు నలభై వేల విలువచేసే ఖరీదైన ఆభరణాలు, వస్తువులు శాశ్వతంగా తమనుంచి నిష్క్రమిస్తున్నాయి. ఆమెలో దుఃఖం అలల్లా పొంగి కళ్ళ వెంబడి కన్నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి. హఠాత్తుగా ఆమెకా సమయంలో మెరుపులాంటి ఆలోచన తట్టింది.

ఎలాగైనా భర్తని మేల్కొల్పగలిగితే ఈ దొంగ వెధవల్ని అమాంతం తన బలిష్టమైన బాహువులకింద ఇరికించి గోగిపుల్లల్లా విరిచిపారెయ్యగలడు. ఒకడిమీద ఒకణ్నివేసి చావచితకదన్ని ఎంగిలి విస్తరాకుల్లా బయటికి గిరాటెయ్యగలడు.

కత్తి ధరించివున్న వ్యక్తి బీరువావేపు తన సహచరుల చర్యల్ని శ్రద్ధగా గమనిస్తున్న సమయాన్ని చూసుకుని ఆశతో, ఆత్మవిశ్వాసంతో నెమ్మదిగా జరిగి భర్త మంచాన్ని సమీపించింది సరోజ భర్త వామహస్తం ఆమెకి చేరువగా మంచం పట్టె మీద చాచివుంది ఆమె ప్రయత్నానికి ఎంతో అనుకూలంగా. ఆ వ్యక్తిని చాటుగా చేసుకుని భర్త చేతి మీద బలంగా గిచ్చడం ప్రారంభించింది. మధుమూర్తి చెయ్యి కదల్చలేదు అతని గుర్రుశబ్దం ఆగలేదు.

ఆ వ్యక్తి సరోజ వ్యర్థప్రయత్నాన్ని గమనించి లోలోపలనవ్వుకుని 'గురువుగారు ఆదమరచి నిద్రపోతున్నారు దయచేసి వారికి నిద్రాభంగం కలిగించకండి పాపం' అన్నాడు ఎంతో నిబ్బరంగా.

అయినా ఆమెడ తన ప్రయత్నాన్ని విడనాడలేదు. శక్తినంతా కూడగట్టుకుని ఆశగా అతన్ని గిల్లుతూనే వుంది.

నిమిషాలమీద ఆ వ్యక్తులిద్దరూ వస్తువులన్నీ సూట్‌కేస్‌లో సర్దుకుని బీరువాని యధాప్రకారం మూసి కత్తి ధరించివున్న తమ నాయకుణ్ని సమీపించారు పనైపోయిందన్నట్లు.

ఆ వ్యక్తి తన సహచరులిద్దర్నీ బయటికి నడవమని సౌంజ్ఞ చేశాడు. అలాగే వాళ్ళిద్దరూ నెమ్మదిగా గడియ తీసుకుని నిశ్శబ్దంగా బయటికి వెళ్ళిపోయారు.

"జాగ్రత్తగా తలుపులు వేసుకోండి ఏం గొడవ చెయ్యకుండా!" అని ఆ వ్యక్తి కత్తి మడిచి జేబులో పెట్టుకుని సుడిగాలిగా బయటికి దూసుకుపోయాడు.

సరోజ దుఃఖం కట్టలు త్రెంచుకుంది.

"మన కష్టార్జితం, మన సర్వస్వాన్నీ దొంగలు దోచుకుపోయారు. ఇహనైన లేవండి!" అంటూ భర్తమీద విరుచుకుప[డి] గుండెలు పగిలేలా ఏడుస్తోంటే, వాళ[్ళ] మగపిల్లలిద్దరూ పదేళ్ళలోపు వాళ్ళు కంగారుగా లేచి ఏమిటో అర్థం కాక తల్[లి] ఏడుపుతో శృతి కలిపారు.

కాసేపట్లో ఇల్లంతా ఏడుపులు, పె[డ]బొబ్బలతో దద్దరిల్లిపోతోంది.

అయినా మధుమూర్తి గుర్రు శబ్ద[ం] మాత్రం నిరాఘాటంగా సాగిపోతూ[నే] వుంది. ★

